

వైసీపీ ప్రభుత్వానికి గట్టిగా రెండు నెలల సమయం కూడా లేదు. రానున్న ఎన్నికల్లో మళ్లీ గెలుస్తుందో లేదో అనుమానమే! ఇదే భావనలో వైసీపీ నాయకులు కూడా ఉన్నారు. దీంతో ఉన్న నాలుగు రోజులు ఇష్టారీతిన దోచుకునేందుకు తెగబడుతున్నారు. జిల్లాలో రోజుకో చోట వైసీపీ నాయకులు చేసే అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. తాజాగా కొలిమిగుండ్ల మండలంలోని విలువైన ప్రభుత్వ ఖనిజ భూములను డీకేటీ పట్టాల మాటున కొంతమంది తమ పరం చేసుకుంటున్నారు. ఇవి ఆన్‌లైన్‌లో కూడా నమోదు కావడం గమనార్హం. వీటి వెనుక నియోజకవర్గ స్థాయి నాయకుడి హస్తం ఉందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ తతంగం అంతా అధికారులకు తెలిసే జరుగుతోందన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం కలుగజేసుకుని ప్రభుత్వ భూములను ఇతరుల పరం కానివ్వకుండా చూడాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



అక్రమంగా.. అప్పనంగా...!



రాళ్లు, రప్పలతో నిండి ఉన్న గొర్విమానుపల్లె భూములు

- పంపిణీకి సాధ్యం కాని భూములపై వైసీపీ నేతల కన్ను
- సర్వే నంబర్లు మార్చి.. ఏమార్చి!
- కొలిమిగుండ్లలో ప్రభుత్వ భూములు స్వాహా
- అడ్డదారిలో డీకేటీ పట్టాలు
- సొంతం చేసుకునేందుకు ఎత్తులు
- కీలక నాయకుడి స్కెచ్
- నిబంధనలకు విరుద్ధంగా భూముల మార్పు

నంద్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కొలిమిగుండ్ల మండలంలోని అత్యధిక భూభాగం విలువైన ఖనిజ నిల్వలను కలిగి ఉంది. ఈ భూములు దాదాపుగా వ్యవసాయానికి అనువైనవి కావు. వీటిపైన స్థానిక నాయకుడి కళ్లు పడ్డాయి. వీటిని ఎలాగైనా కాజేయాలని పన్నాగం పన్నాడు. ఖనిజ భూములను సులభంగా సొంతం చేసుకోలేడు కాబట్టి ప్లాన్ బి అమలు చేశాడు. ముఖ్యంగా గొర్విమానుపల్లె, పెట్నికోట గ్రామాల్లోని ప్రభుత్వ ఖనిజ భూములను వ్యవసాయానికి అనువైన భూములుగా మార్చి, వాటిని తన వారికి కట్టబెట్టి, ఆ తర్వాత తను సొంతం చేసుకోవాలనుకున్నాడు. అనుకున్నదే తడవుగా ఆ భూములు వ్యవసాయానికి అనువుగా ఉంటాయో లేదో తేల్చాలని అధికారులను కోరాడు. ఆయన కోరిన వెంటనే అధికారులు రెవెన్యూ, వ్యవసాయ, మైనింగ్, స్థానిక అధికారులతో ఫోర్‌మెన్ కమిటీని నియమించింది. నాయకుడి అండతో అధికారులు ఖనిజ భూములను వ్యవసాయ యోగ్య భూములుగా నిర్ధారించారు. దీంతో ఆ భూములను నిరుపేదలకు అందించే డీకేటీ పట్టాల రూపంలో సదరు నాయకుడు అధికారుల సాయంతో తన వారికి కట్టబెట్టాడు.



సర్వే నంబరు 1221లో గతంలో ఇచ్చిన డీకేటీ పట్టాలను రద్దు చేయాలంటూ అప్పటి కలెక్టర్ జి.వీరపాండియన్ ఇచ్చిన ఆదేశాలు

సర్వే నంబరు 1360-1, 2, 3 నుంచి వరుసగా డీకేటీ పట్టాలుగా చూపిస్తున్న రెవెన్యూ రికార్డు



అతి తెలివి..


కొలిమిగుండ్ల మండలం గొర్విమానుపల్లె, పెట్నికోట గ్రామాల పరిధిలో సర్వే నంబరు 1,221 కింద దాదాపు 410 ఎకరాలు ఉంది. ఇక ఈ గ్రామాల పరిధిలో సర్వే నంబరు 1,360 చివరిది. గతంలో వైసీపీ నాయకులు ఈ భూమిని కొట్టేసేందుకు ప్రయత్నించగా కొంతమంది అడ్డుకొని కోర్టును ఆశ్రయించారు. దీనికి సంబంధించిన కేసు ఇంకా కోర్టులో నడుస్తోంది. ఇక ఇదే సర్వే నంబరులో కొంతమంది డీకేటీ పట్టాలు పొందారని, ఆ పట్టాలను రద్దు చేయాలని 2020లో కొంతమంది జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అప్పటి జిల్లా కలెక్టర్ జి.వీరపాండియన్ ఈ పట్టాలను రద్దు చేయాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏవిధంగా చూసినా ఈ భూములు డీకేటీ పట్టాలుగా పంచడం కుదరదు. ఇక్కడే నాయకులు, అధికారులు తమ తెలివిని ప్రదర్శించారు. కోర్టులో ఉన్న భూములను డీకేటీ పట్టాలుగా మార్చి భూమిని పంచితే కోర్టు ధిక్కారం కింద కేసులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అంతేకాకుండా జిల్లా అధికారులు ఇచ్చిన ఆదేశాలను పరిగణలోకి తీసుకోకపోవడం కిందకు వస్తుంది. డీకేటీ పట్టాలను కొత్త నంబరుతో ఇస్తే ఏ గొడవ లేకుండా పోతుందన్న భావనకు వచ్చారు. ముందుగా ఆ భూములను వ్యవసాయానికి అనువైన భూములుగా నిర్ధారించారు. ఆ తర్వాత 1360-1 నుంచి మొదలుపెట్టి, 1360-2, 3, అంటూ భూములను వైసీపీ నాయకుడు ఎవరికి చెబితే వారికి ఇచ్చేశారు. ఈ లెక్కన భవిష్యత్‌లో ఏవరైనా అభ్యంతరం పెట్టినా, కేసు వేసినా, సదరు 1,221లోని ఖనిజ భూములను తాము ఎవరికీ కట్టబెట్టలేదని, పైగా వ్యవసాయానికి అనువైన భూమిని ఇచ్చి తప్పించుకునేందుకు చేసినట్లు తెలుస్తోంది. ఈ తతంగం అంతా చూస్తుంటే.. సంబంధిత అధికారులు పక్కా ప్లాన్ ప్రకారం వైసీపీ నాయకుడి ఆదేశాల మేరకు చేసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఇందుకు వారు బాగానే డబ్బు ముట్టజెప్పి లబ్ధి పొందినట్లు కొలిమిగుండ్ల మండలంలో జోరుగా చర్చ జరుగుతోంది.



● జీవో నం.74 ఏం చెబుతోంది..

కొలిమిగుండ్లలోని ఆయా గ్రామాల్లో అపారమైన ఖనిజ నిల్వలున్నాయి. ఇలాంటి ఖనిజ నిల్వలున్న భూములు కేవలం మైనింగ్ జరిపేనందుకే ఇవ్వాలని జీవో నం.74 చెబుతోంది. దీని ప్రకారం ఖనిజ నిల్వలున్న భూములు వ్యవసాయానికి కట్టబెట్టకూడదని, అలాగే ఈ భూములను మైనింగ్‌కు కేటాయించకుండా వేరే అవసరాల కోసం వాడుకుంటామన్న వారికి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కూడా ఇవ్వకూడదని కూడా జీఓలో ఉంది. ఇక జీఓనం.1,142 మైనింగ్ భూములను వ్యవసాయ అవసరాల కోసం గానీ, డీ పట్టాలు ఇవ్వడానికి లేదని చెబుతోంది. ఈ విషయాలను కోర్టుకు తెలియజేసేలా కొంతమంది పిటీషన్ దాఖలు చేశారు. ఇక దీనికి తోడు ఈ మైనింగ్ భూముల్లో చాలా వరకు సిమెంటు కంపెనీల కింద లీజుకు తీసుకోగా, మరికొన్ని భూములు ఇతర అవసరాల కోసం ప్రైవేటు వ్యక్తులు లీజుకు తీసుకున్నారు. అటు జీఓ ప్రకారం చూసుకున్నా, ఇటు ప్రైవేటు వ్యక్తులు లీజు కింద ఉన్న విషయం చూసుకున్నా అధికార పార్టీ నేత సూచించిన విధంగా భూములను కట్టబెట్టేందుకు ఏమాత్రం వీలు కాదు. అయినా సరే అధికార పార్టీ నేత, ఆయన ఆదేశాలను పాటిస్తున్న అధికారులు ఏ విధంగా ముందుకు వెళ్తున్నారో వారికే తెలియాలి.

వైసీపీ నాయకులు కాజేయాలనుకుంటున్న పెట్నికోటలోని భూములు



ఒక్కరి వల్ల అయ్యే పనేనా..


మండలంలోని విలువైన భూములు తన వారికి పంచేందుకు సదరు వైసీపీ నాయకుడు ఎప్పటి నుంచో పకడ్బందీ పథకంతో ఉన్నాడు. ఆ భూములు చేజారిపోకూడదని సంబంధిత అధికారులను ఆదేశించాడు. అసలు ఈ భూములన్నీ ఆన్‌లైన్‌లో ఎక్కించడమే తరువాయి, ఎక్కడ, ఎవరికి, ఎంత, భూమిని కేటాయించాలి? ఒకే కుటుంబంలోని వారికి భూములను ఎలా కేటాయించాలి? అనే పనులన్నీ ముందే సిద్ధం చేసి ఉంచారు. అయితే ఈ పని ఒక్కడి వల్ల సాధ్యమయ్యేది కాదు. రెవెన్యూ అధికారులకు ఎక్కడ ఎలాంటి భూమి ఉందో? సంపూర్ణ అవగాహన ఉంటుంది. ఖనిజ నిల్వలున్న భూములు కాబట్టి వాటి పర్యవేక్షణ మైనింగ్ అధికారులదే! ఇక వ్యవసాయ అధికారులకు ఖనిజ నిల్వలున్న భూములను సాగుభూమిగా నిర్ధారించడం చేయకూడదు. ఇక పట్టాలు పొందాలనుకునే వారి అర్హతలు ఏమిటి? వారు నిరుపేదలా? ఆర్థికంగా స్థితిమంతులా? అనే విషయం స్థానిక అధికారులకు ముందుగానే సమాచారం ఉంటుంది. కానీ ప్రస్తుతం డీకేటీ పట్టాలుగా నిర్ధారించిన భూములు ఖనిజ భూములు. పైగా కోర్టులో ఉన్న భూములు. ఇక డీకేటీ పట్టాలు పొందిన వారిలో కొంతమంది ట్యాక్స్‌లు కూడా కడుతున్నవారు కూడా ఉన్నారు. ఇలా ఏ రకంగా చూసినా సదరు భూములు పంచేందుకు వీల్లేదు. అలాంటిది విలువైన ప్రభుత్వ ఖనిజ భూములు ఇతరుల పరం కావడం పలు అనుమానాలకు తావిస్తోంది. రెవెన్యూ, వ్యవసాయ, మైనింగ్, స్థానిక అధికారులు కుమ్మక్కై భూపందేరం చేశారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయాన్ని జిల్లా హార్టికల్చర్ అధికారి నాగరాజును అడగ్గా.. మైనింగ్ అధికారులు ఖనిజ భూములు కావని చెప్పిన తర్వాతే, తాము పరిశీలించి, ఆ భూములు వ్యవసాయానికి పనికి వస్తాయని నిర్ధారించామని చెప్పుకొచ్చారు. ఇక ఇదే విషయంపై జిల్లా మైనింగ్ అధికారిని సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. ఈ లెక్కన విలువైన ఖనిజ ప్రభుత్వ భూ పంపిణీలో అధికారులు వాటా ఉందన్న అభిప్రాయం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ఉద్యోగులు వెళ్తూ.. వెళ్తూ..

నియోజకవర్గ స్థాయిలో చక్రం తిప్పుతున్న వైసీపీ నాయకుడు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న భూముల స్వాహ ప్రక్రియకు అధికారుల బదిలీ కూడా కలిసి వచ్చింది. ఎన్నికల సమీపిస్తుండటంతో జిల్లాలోని అధికారులను బదిలీ అయ్యారు. ఇందులో భాగంగానే కొలిమిగుండ్ల రెవెన్యూ అధికారులు కూడా బదిలీ అయ్యారు. అయితే అధికారులు బదిలీకి ముందే భూ పంపిణీని పూర్తి చేయాలని సదరు నేత భావించి, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఆ భూములను సాగు భూములుగా మార్చి ఉండటంతో.. అనుకున్న వారి పేరును ఆన్‌లైన్‌లో ఎక్కించి డీకేటీ పట్టాలు ఇచ్చేశారు. భూములు తమ పరం అయిన తర్వాత ఎవరైనా అధికారులను అడిగినా, విషయం తమ దృష్టికి రాలేదనో, తమ హయంలో జరగలేదనో కొత్తగా బాధ్యతలు చేపట్టిన వారు సులువుగా తప్పించుకునేందుకు వీలుంటుంది. ఇంకా గట్టిగా అడిగితే విచారిస్తామని చెబుతారు. ఈలోగా జరగాల్సిన వ్యవహారమంతా జరిగి విషయం మరుగున పడిపోతుంది. ఆ తర్వాత ఎలాగో తాము అనుకున్నట్లుగా ప్రభుత్వ భూములను తమ సొంతం అవుతాయని సదరు నేత ప్లాన్ చేశాడు. అక్రమంగా ఇలా ఖనిజ నిక్షేపాలున్న భూములను అధికార పార్టీ నేతల అనుచరులకు కట్టబెడుతున్న క్రమంలో జిల్లాస్థాయి ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల

- ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ
- ఉమ్మడి జిల్లాలో 1,541 పోస్టులు
- ఎస్జీటీ 1,012, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 529
- కిక్కిరిస్తున్న కోచింగ్ సెంటర్లు



కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 12: ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో నిరుద్యోగుల్లో ఊరట కలిగింది. డీఎస్సీ-24 ప్రిపరేషన్‌కు అతి తక్కువ సమయం ఉండటంతో అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల ముందు మెగా డీఎస్సీని ప్రకటిస్తామని చెప్పిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి తక్కువ పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారని నిరుద్యోగులు విమర్శిస్తున్నారు. ఈ దగా డీఎస్సీని రద్దు చేసి మెగా డీఎస్సీని ప్రకటించాలని ఉపాధ్యాయ విద్యార్థి యువజన నిరుద్యోగుల సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. మరో వైపు డీఎస్సీకి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు. కొంత కాలంగా నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,541 పోస్టులు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,541 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనున్నారు. ఇందులో 1,012 ఎస్జీటీ పోస్టులు కాగా, మిగతా కేటగిరీల్లో స్కూల్ అసిస్టెంట్ల పోస్టులు 529 ఉన్నాయి.

'టెట్'కు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

టెట్ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఇబ్బడిముబ్బడిగా దరఖాస్తులు వచ్చిపడుతున్నాయి. ఫిబ్రవరి 18వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకునేందుకు వీలుంది. 19వ తేదీన ఆన్‌లైన్ మాక్ టెస్టు అందుబాటులోకి వస్తుంది. ఫిబ్రవరి 23వ తేదీ నుంచి అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడు చేసుకోవచ్చు. ఫిబ్రవరి 27వ తేదీ నుంచి మార్చి 9వ తేదీ వరకు టెట్ పరీక్షను నిర్వహిస్తారు. మార్చి 10న ప్రాథమిక కీని విడుదల చేసి.. 11న అభ్యంతరాలను స్వీకరిస్తారు. 13న ఫైనల్ కీని విడుదల చేసి 14న ఫలితాలు ప్రకటిస్తారు.

ప్రారంభమైన డీఎస్సీ ప్రక్రియ

ఫిబ్రవరి 12 నుంచి 21వ తేదీ వరకు డీఎస్సీ పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు ఇచ్చారు. ఫిబ్రవరి 22వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తారు. మార్చి 5వ తేదీ నుంచి అభ్యర్థులు హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మార్చి 15 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్ పరీక్ష కొనసాగుతుంది. ఈ పరీక్షలు ప్రతిరోజూ రెండు సెషన్స్‌లో జరుగుతాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్ పరీక్ష కొనసాగుతుంది. 31న ప్రాథమిక కీ విడుదల చేస్తారు. ఏప్రిల్ 1న ప్రాథమిక కీ పై అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఏప్రిల్ 7న డీఎస్సీ ఫలితాలను ప్రకటిస్తారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ట వయో పరిమితి 44 ఏళ్లు. రిజర్వు కేటగిరీ అభ్యర్థులకు మరో ఐదేళ్లు సడలింపు ఇచ్చారు. ఆన్‌లైన్ ప్రక్రియలో అభ్యర్థులకు ఏమైనా అనుమానాలు నివృత్తి చేసుకునేందుకు 95056 19127, 97056 55349 హెల్ప్‌డెస్క్ నెంబర్లను సంప్రదించవచ్చు.

అయ్యో ఐప్యాక్..!

- అసంతృప్తుల బుజ్జగింపులో తలమునకలు
- ఫోన్‌లో స్పందించకపోవడంతో స్వయంగా రంగంలోకి
- ఆత్మకూరులో పలువురి కౌన్సిలర్లతో సంప్రదింపులు..!



ఆత్మకూరు, ఫిబ్రవరి 12: ఆత్మకూరు వైసీపీ కౌన్సిలర్ల అసమ్మతి వైఖరి ఆ పార్టీ నేతలకు తలనొప్పిగా మారింది. కొన్ని రోజులుగా మున్సిపల్ చైర్మన్‌తో సహా కొంత మంది వైసీపీ కౌన్సిలర్లు పార్టీని వీడతారని ప్రచారం జరుగుతోంది. దీంతో వైసీపీ కోసం అంతర్గతంగా పని చేస్తున్న ఐప్యాక్ బృందం రంగంలోకి దిగింది. తొలుత అసంతృప్తిగా ఉన్న కౌన్సిలర్లను గుర్తించి ఫోన్లు చేయగా చాలా మంది స్పందించ లేదు. దీంతో చేసేది ఏమీ లేక సోమవారం ఆత్మకూరు పట్టణానికి విచ్చేసి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా తండ్రి, కోఆప్షన్ సభ్యులు ఎంఏ రషీద్‌ను స్వయంగా కలిసినట్లు తెలిసింది. పార్టీ వీడే ఆలోచనలు ఏవైనా ఉన్నట్లయితే విరమించుకోవాలని కోరినట్లు సమాచారం. అంతేకాదు.. అసంతృప్తికి గల కారణాలపై ఆరా తీసినట్లు తెలిసింది. దీనిపై ఎంఏ రషీద్ తీవ్రంగానే స్పందించినట్లు వినికిడి. ప్రజా క్షేత్రంలో గెలిచిన కౌన్సిలర్లను కాదని వార్డుల్లో ఇతర వ్యక్తులకు పెత్తనం ఇవ్వడం ఏంటని ప్రశ్నించినట్లు సమాచారం. కౌన్సిలర్లకు ఎలాంటి పవర్ ఇవ్వనప్పుడు ఆ పదవిలో ఎందుకు కొనసాగాలని నిలదీసినట్లు సమాచారం. ఇంతకాలం పార్టీలో కౌన్సిలర్లకు జరుగుతున్న అవమానాలను గుర్తించకుండా ఎన్నికలు వచ్చాయని ఇప్పుడు రావడం ఎంతవరకు సబబని ఐప్యాక్ బృందాన్ని ఆయన కడిగిపారేసినట్లు వైసీపీకి చెందిన కౌన్సిలర్లే చర్చించుకుంటున్నారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కూడా ఎంఏ రషీద్‌కు నచ్చజెప్పుకుంటున్నట్లు సమాచారం.

అనంతపురం సభకు వెళ్లేందుకు నిరాసక్తి

ఈ నెల 18న అనంతపురంలో జరిగే జగన్ సభకు వెళ్లేందుకు చాలా మంది కౌన్సిలర్లు ఆసక్తి చూపడం లేదని తెలిసింది. ఈ సభకు జనాన్ని తరలించేందుకై ప్రతి రెండు వార్డులకు కలిపి ఒక బస్సు ఏర్పాటు చేసి ఖర్చులకుగాను వార్డుకు రూ.10 వేలు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. అయితే ఈ సభకు జనాన్ని తీసుకెళ్లేందుకు పలువురు కౌన్సిలర్లు ముందుకు రాలేదని తెలిసింది. చివరకు అనంతపురం సభకు సంబంధించి జనాన్ని తరలించే అంశంపై సోమవారం సాయంత్రం వార్డు ఇన్‌చార్జిలు, కౌన్సిలర్లతో ఎమ్మెల్యే శిల్పా సోదరుడు శిల్పా భువనేశ్వరరెడ్డి ఆత్మకూరులోని వైసీపీ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేయగా పలువురు కౌన్సిలర్లు గైర్హాజరైనట్లు తెలిసింది. అంతేకాదు.. ఫోన్లు చేస్తారేమోనని చాలా మంది కౌన్సిలర్లను స్విచ్ఛాఫ్ చేసినట్లు కూడా తెలుస్తోంది.

సమస్యలను సత్వరమే పరిష్కరించండి

కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 12: స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం వైఎస్సార్ సెంటనరీ హాల్లో స్పందన-ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా కలెక్టర్‌తోపాటు డీఆర్‌ఓ పద్మజ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఒక్క దరఖాస్తును క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పందనలో 164 దరఖాస్తులు రాగా వాటన్నింటిని విథిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ సైన్స్‌కు ప్రాజెక్టుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో విద్యాశాఖ అధికారులు

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 12: నంద్యాలలో రాష్ట్ర విద్యా పరిశోధనా సంస్థ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి మనక్ విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన సోమవారంతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 173 సైన్స్ ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. ప్రదర్శనలో అత్యంత ప్రతిభ కనబరచిన తొమ్మిది ప్రాజెక్టులను జిల్లా విద్యాశాఖ, సైన్స్ అధికారులు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులను డీఈవో సుధాకర్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి సుందర్‌రావు, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి తదితరులు అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో మహబూబ్ బేగ్, ఎంఈవో బ్రహ్మం, జిల్లా దీక్ష సమన్వయకర్త నాగేంద్రకుమార్, ఎస్ఐఎఫ్ జాతీయ పరిశోధకుడు బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్రలో ఇసుకాసురులు

- మూడు రోజులుగా అక్రమంగా ఇసుక తరలింపు
- కోసిగి మండలంలో అక్రమ రవాణా
- పట్టించుకోని పోలీసులు

కోసిగి, ఫిబ్రవరి 12: తుంగభద్ర నదిలో నీరు లేకపోవడంతో నదితీర గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళనలో ఉన్నప్పటికీ నదిలో నీరు లేదని వైసీపీ నేతలు మాత్రం రెచ్చిపోతున్నారు. తుంగభద్ర నదిని మూడు రోజులుగా ఇష్టానుసారంగా తోడేస్తున్నారు. 20 ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలించి తుంగభద్ర సరిహద్దు ప్రాంతాల్లో ఇసుక నిల్వలు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామీణ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే.. వైసీపీ నాయకులు మాత్రం ఇసుకదాహంతో రెచ్చిపోతున్నారు. శనివారం నుంచి సాతనూరు గ్రామ సమీపంలోని పులికనుమ పంప్‌హౌస్ దగ్గర తుంగభద్ర నదిలో ఇసుకను తోడేస్తున్నారు. జంపాపురం గ్రామానికి చెందిన వైసీపీ ముఖ్యనాయకుడు, మండల కాంట్రాక్టరు తన సొంత ట్రాక్టర్లు, లీజు ట్రాక్టర్ల ద్వారా భారీ ఎత్తున తుంగభద్ర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూ తన గ్రామంలో అనుకూలమైన చోట డంపు ఏర్పాటు చేసుకుంటున్నారు. అదేవిధంగా ఐరంగల్, తుమ్మిగనూరు, తుంగభద్ర, ఖగ్గల్లు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు సైతం ట్రాక్టర్ల ద్వారా ఒకే చోట నుంచి జేసీబీ ద్వారా తుంగభద్రలోని ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఈ విషయం తెలిసినా పోలీసులు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు దారితీస్తోంది. అధికారం మాటున వైసీపీ నాయకులు తుంగభద్ర నదిని అడ్డంగా తవ్వేస్తున్నారు. ఇసుకను నిల్వ చేసి ట్రాక్టర్ల ద్వారా తరలించి లక్షలాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. రెవెన్యూ, మైనింగ్ పోలీసు అధికారులు అధికార పార్టీ నాయకులకు అండగా ఉండటంతో ఇసుకాసురులు మరింత రెచ్చిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచిచూడాలి.


వైసీపీ నాయకులకు చెందిన ట్రాక్టర్లలో అక్రమంగా తరలుతున్న ఇసుక


సాతనూరు దగ్గర తుంగభద్ర నదిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న అధికార వైసీపీకి చెందిన నాయకుల ట్రాక్టర్లు


సాతనూరు సమీపంలో తుంగభద్ర నదిలో ట్రాక్టర్లు, కూలీలతో అక్రమ ఇసుక సరఫరా చేస్తున్న దృశ్యం

బ్రహ్మోత్సవాలకు ముహూర్తం ఖరారు

మార్చి 8 నుంచి 13 వరకు ఉత్సవాలు


మహా శివరాత్రి ఉత్సవాల లగ్న పత్రికను ఈవోకు అందజేస్తున్న అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ

ఓర్వకల్లు, ఫిబ్రవరి 12: మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 8 నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో డీఆర్‌కేవీ ప్రసాద్, ఆలయ చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని కాల్వబుగ్గ పుణ్యక్షేత్రంలో ఈవో ప్రసాద్, కాల్వబుగ్గ చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ, కల్లె నరసింహాశర్మ మహా శివరాత్రి ముహూర్తాన్ని ఖరారు చేశారు. మార్చి 8 నుంచి 13వ తేదీ వరకు కాల్వబుగ్గలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు. 8న శుక్రవారం బుగ్గ రామేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు కాల్వ గ్రామం నుంచి కాల్వబుగ్గకు వరకు ప్రయాణం, 9న శనివారం మహాశివరాత్రి కుంకురార్పణ, ధ్వజారోహణం, పగలు బుగ్గ రామేశ్వరస్వామి, భ్రమరాంబదేవికి పంచామృతాభిషేకం, రాత్రి స్వాములవారికి గ్రామాభిషేకం, తెల్లవారితే 10వ తేదీ ఆదివారం 3.35 గంటలకు స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవం, అదే రోజు నంది వాహన సేవ వాయిద్యాలతో సాయంత్రం 5 గంటలకు ప్రభోత్సవం, అలాగే 11న సోమవారం సాయంత్రం 5 గంటలకు రథోత్సవం, 12న మంగళవారం ఉదయం వసంతోత్సవం, సాయంత్రం పారువేట, 13న బుధవారం పంచామృతాభిషేకం బుగ్గ రామేశ్వరస్వామి ఉత్సవమూర్తులను కాల్వ గ్రామానికి తిరుగు ప్రయాణం కార్యక్రమాలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. లగ్న పత్రికను స్వామి అమ్మవార్ల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో హుశేనాపురం సింగిల్ విండో అధ్యక్షుడు నాగతిరుపాలు, ఎంపీటీసీ నాగిరెడ్డి, ధర్మకర్తలు ఆకుల మహేష్, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని చిరుత మృతి

కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై ఘటన


మృతి చెందిన చిరుత

ఆత్మకూరు, ఫిబ్రవరి 12: నల్లమల అడవి సమీపంలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ చిరుత మృతి చెందింది. సిద్ధాపురం చెరువు అలుగు దాటిన తర్వాత బైర్లూటి సమీపంలోని కేజీ రోడ్డుపై సుమారు ఏడాది వయస్సు గల ఓ ఆడ చిరుతపులి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న అటవీ అధికారులు చిరుత కళేబరాన్ని బైర్లూటి వన్యప్రాణి వైద్య చికిత్సా కేంద్రాన్ని తీసుకెళ్లి వెటర్నరీ వైద్యులపై పోస్టుమార్టం నిర్వహించి దహనం చేశారు. కాగా ఘటనపై నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం ఫీల్డ్ డైరెక్టర్ బీఎన్ఎన్ మూర్తి, ఆత్మకూరు, మార్కాపురం అటవీ డివిజన్ల డిప్యూటీ డైరెక్టర్లు అలాన్ చోంగ్ టెరాన్, విఘ్నేష్ అప్పావ్ ఆరా తీశారు. నల్లమల అటవీ ప్రాంతంలోని కేజీరోడ్డుపై వాహనాల రద్దీ పెరిగిన నేపథ్యంలో ప్రతి 50మీటర్లకు ఓచోట స్పీడ్‌బ్రేకర్‌ను ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని తగ్గించాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు గాను ఎన్‌హెచ్-340సీ అధికారులతో అటవీ అధికారులు చర్చించనున్నట్లు సమాచారం.

ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు 244 మంది గైర్హాజర్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 12: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలకు సోమవారం 244 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్‌ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. జిల్లాలో మొత్తం 8,818 మందికిగానూ, 8574 మంది హాజరయ్యారు. 244 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన సెషన్స్‌లో 4798 మందికి గానూ 4656 మంది హాజరు కాగా, 142 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన సెషన్స్‌లో 4020 మందికి గానూ 3918 మంది హాజరు కాగా, 102 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్‌ఐవో తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాలను డీఈసీ కమిటీ సభ్యులు ఆర్‌ఐవో, డీవీఈవో, స్క్వాడ్ బృందాలు పర్యవేక్షణ చేసినట్లు ఆయన వివరించారు.

టెలికాం సెక్టార్‌లో ఉపాధి అవకాశాలు


మాట్లాడుతున్న నోముల ప్రసాద్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 12: టెలికాం రంగంలో జరుగుతున్న విప్లవాత్మక అభివృద్ధి వల్ల యువతకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని రీజనల్ హెడ్ టెలికాం సెక్టార్ స్కిల్ కౌన్సిల్ రిటైర్డ్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఫ్లైట్ లెఫ్టినెంట్ నోముల ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో టెలికాం రంగం, యువత ఉపాధి అవకాశాల అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత వారి నైపుణ్యాలతో దేశ పురోగతికి ఎలా భాగస్వాములు కాగలరో వివరంగా వివరించారు. దేశాభివృద్ధికి చక్కటి బాటలు వేసి ప్రపంచ దేశాల్లో మన దేశానికి కీర్తిప్రతిష్ఠలు పెంపొందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్, ప్రిన్సిపాల్ కేవీ శ్రీనివాసమూర్తి, ఇన్నోవేషన్ కౌన్సిల్ కోఆర్డినేటర్ జయలక్ష్మి, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లిక్కర్ మాల్‌లో చోరీ

రూ.5.80 లక్షల నగదు అపహరణ

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 12 : నంద్యాల పద్మావతి నగర్‌లో ఉన్న ప్రభుత్వ లిక్కర్ మాల్‌లో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. లిక్కర్‌మాల్ రేకుల షెడ్డు కావడంతో షెడ్డుపై నుంచి రేకులు తొలగించి లోపలికి ప్రవేశించి క్యాష్ కౌంటర్‌లోని రూ.5.80లక్షల నగదును దొంగలు అపహరించుకు వెళ్లారు. సోమవారం షాపును తెరిచేందుకు వచ్చిన యాజమాన్యం షాప్ లోపల పై భాగంలో రేకులను తొలగించడాన్ని గమనించారు. క్యాష్‌కౌంటర్ వద్ద క్యాష్ కనబడకపోవడంతో చోరీ జరిగిందని నిర్ధారించుకున్నారు. రెండవ పట్టణ పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని చోరీ తీరును పరిశీలించారు. అర్ధరాత్రి ముగ్గురు వ్యక్తులు లోనికి చొరబడి చోరీకి పాల్పడిన దృశ్యాలు సీసీ కెమెరా ఫుటేజీలో చూసి దర్యాప్తు ప్రారంభినట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు.

వైసీపీ నాయకుడి భార్య దుశ్చర్య

- ఆటోడ్రైవర్‌ను చెప్పుతో కొట్టిన వైనం
- ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాధితుడు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 12 : నంద్యాల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి వెలుపల ప్యాసింజర్లను దింపుతూ ఉన్న ఆటో డ్రైవర్‌ను వైసీపీ నాయకుడి భార్య చెప్పుతో కొట్టడం దుమారం రేపింది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల మేరకు.. నంద్యాలలోని సాయిబాబా నగర్‌కు చెందిన ఓబులేసు 30 సంవత్సరాలుగా ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం నంద్యాల బాలాజీ కాంప్లెక్స్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి వెలుపల రోడ్డు పక్కన ప్యాసింజర్లను దింపేందుకు ఆటో నిలబెట్టాడు. అటుగా కారులో వచ్చిన వైసీపీ నాయకుడు దేరెడ్డి శివనాగిరెడ్డి భార్య శివానందమ్మ శివాలెత్తింది. ట్రాఫిక్ జామ్ కావడంతో ఆటోను పక్కకు తొలగించలేదని కోపంతో ఒక్కసారిగా కారులో నుంచి దిగి ఆటో డ్రైవర్ ఓబులేసును చెప్పుతో కొట్టింది. ఎలాంటి తప్పు చేయని తనను చెప్పుతో కొట్టడంపై ఓబులేసు నిలదీశాడు. దీంతో కాసేపు ఇరువురి మధ్య వాదన చోటుచేసుకుంది. తీవ్ర మనస్తాపానికి గురైన ఆటో డ్రైవర్ ఓబులేసు పురుగుల మందును కొనుగోలు చేసి ఆస్పత్రి ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే స్థానికులు నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. ఓబులేసు పరిస్థితి విషమంగా ఉండటంతో పట్టణంలోని ఓ ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు, సీఐటీయూ జిల్లా నాయకుడు లక్ష్మణ్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు దాడికి పాల్పడిన మహిళ ఇంటి ముందు ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలతో చర్చించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.


చికిత్స పొందుతున్న ఓబులేసు

వైసీపీలో అభ్యర్థులే లేరా..?

టీడీపీ భరత్


సమావేశంలో మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 12: కర్నూలులో టీడీపీపై పోటీ చేసేందుకు వైసీపీకి అభ్యర్థులే దొరకడం లేదని నియోజకవర్గ ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. సోమవారం నగరంలోని 17వ వార్డులో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్కిల్‌లో టీడీపీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ సిద్ధమని చెప్పుకుంటున్న వైసీపీ నాయకులు కర్నూలులో తనకు దీటుగా అభ్యర్థిని కూడా బరిలోకి దింపలేకపోతున్నారన్నారు. వైసీపీలో అభ్యర్థి ఎవరున్నా కర్నూలులో గెలిచేది టీడీపీనే అన్నారు. తాము అధికారంలో లేకపోయినా ప్రజలకు సేవ చేస్తూనే ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పద్మలతారెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు నాగరాజు, జనసేన ఇన్‌చార్జి అర్షద్, బాబ్జీ, అనంతరత్నం, చంద్రమోహన్, వినోద్ చౌదరి, ముంతాజ్, మారుతి శర్మ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు,

పాణ్యంలో చోరీ

- 5 తులాల బంగారు, రూ.4 లక్షల నగదు అపహరణ
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

పాణ్యం, ఫిబ్రవరి 12: పాణ్యం బీసీ కాలనీ సమీపంలో ఎస్సార్బీసీ కాలువ పక్కన ఉన్న విశ్రాంత సిపాయి వసంతనాయుడు ఇంట్లో సోమవారం ఉదయం 9 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ జరిగింది. వివరాలివీ.. వసంతనాయుడు కొత్తగా నిర్మించుకున్న ఇంటిలో నివాసముంటున్నారు. సోమవారం ఉదయం నంద్యాలకు దంత వైద్యుని వద్దకు తన సతీమణి వసంతతో పాటు వెళ్లారు. మధ్యాహ్నం 12:20కు తిరిగి ఇంటికి వెళ్లారు. అయితే తాళాలు పగులగొట్టి బీరువాలోని రూ. 4 లక్షలు నగదు. 5 తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఘటన జరిగిన ఇంటిని పరిశీలించారు. ఎస్‌ఐ అశోక్ ఈ సంఘటనపై మాట్లాడుతూ దొంగతనం సంఘటన తమ దృష్టికి వచ్చిందని, బాధితులను విచారించి కేసు నమోదు చేస్తామని చెప్పారు.

షర్మిలను విమర్శిస్తే ఊరుకునేది లేదు

డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్


మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 12: ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను విమర్శిస్తే ఊరుకునేదిలేదని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. సోమవారం డీసీసీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహ మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి షర్మిల చేస్తున్న విస్తృత పర్యటనలతో వైసీపీ నాయకులకు భయం పట్టుకుందన్నారు. ఇటీవల వైసీపీ నాయకుడు కోన రఘుపతి, పలువురు నాయకులు షర్మిలను ఉద్దేశించి చేస్తున్న విమర్శలు నాలుగు గోడల మధ్య ఉండి చేస్తున్నారని, ఇది వారి చేతకానితనానికి నిదర్శనమన్నారు. ఎన్నికల ముందు కొన్ని ఉపాధ్యాయ పోస్టులను విడుదల చేసిన సీఎం జగన్ మెగా డీఎస్సీని అంటూ నిరుద్యోగులను మోసగించాడన్నారు. అధికారంలోకి వస్తే సీపీఎస్ రద్దు చేసి వారంలో ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తానని జగన్ ఐదేళ్ల క్రితం హామీ ఇచ్చి ఉద్యోగులను మోసగించాడన్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్‌లోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి దాదాపు 200 మంది కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ పరిశీలకుడు బండి జకరయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల మోహన్‌రావు, పట్టణ అధ్యక్షుడు చింతలయ్య పాల్గొన్నారు.

22, 23 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు


కేవీఆర్‌లో అంతర్జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 12: కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 22, 23ల్లో అంతర్జాతీయ సందస్సు నిర్వహిస్తున్నట్లు క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ తెలిపారు. సోమవారం క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి చాంబర్లో గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎంసీ సాహిత్య ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సదస్సులో పాలస్తీనా, ఇజ్రాయెల్ దేశాల్లో ఎడతెగని సమస్యలు వాటి ప్రభావం మీద రెండు రోజుల సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు దేశ, విదేశాల నుంచి విద్యావేత్తలు రానున్నారని, అధ్యాపకులు, విద్యార్థులు ఇందులో పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్, డాక్టర్ పార్వతి, డాక్టర్ ఇర్ఫాన్, రాధారాణి, సునీత తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే భవిష్యత్తు : గౌరు చరిత


34వ వార్డు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న గౌరుచరిత

కల్లూరు, ఫిబ్రవరి 12: రాష్ట్ర ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే మళ్లీ టీడీపీ అధికారంలోకి రావాలని పాణ్యం నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు చరిత పేర్కొన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 19,34 వార్డుల్లో చేపట్టిన 'బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి గౌరు చరిత హాజరై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ విధానాలకు ప్రజలు విసిగిపోయారన్నారు. ఎన్నికల హామీలను సీఎం జగన్ గాలికొదిలేశారన్నారు. ఉద్యోగులు, మహిళలు, యువత వివక్షతకు గురయ్యారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్ యాదవ్, జిల్లా కోశాధికారి పియూ. మాదన్న, ఎన్‌వి. రామకృష్ణ, దాశేష్‌గౌడ్, సులేమాన్, పెద్దటేకులపల్లి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేసీ కాలువలో పడి వ్యక్తి మృతి

నందికొట్కూరు ఫిబ్రవరి 12: నందికొట్కూరు పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కేసీ కాలువలో పడి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. నందికొట్కూరులోని రజకపేటలో నివాసముంటున్న ఆవుల వెంకటేశ్వర్లు(46) ఆదివారం ఉదయం దుస్తులు శుభ్రం చేసేందుకు బిజినవేముల సమీపంలోని కేసీ కెనాల్‌కు వెళ్లాడు. సాయంత్రం అవుతున్నా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బిజినవేముల సమీపంలో కేసీ కాలువలో వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. పెద్దవెంకటేశ్వర్లు కుమారుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు.

స్పందన ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వండి : ఎస్పీ

పోలీస్ స్పందనకు 102 ఫిర్యాదులు



మహిళతో సమస్యను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 12: పోలీస్ స్పందనలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో ఎక్కువగా సివిల్ తగాదాలు, కుటుంబ కలహాలు, అన్నదమ్ముల ఆస్తి పంపకాలలో మనస్పర్థలు లాంటి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. జిల్లా నలుమూలల నుంచి 102 సమస్యలతో కూడిన ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. వెలుగోడు మండల రేగడగూడూరు గ్రామానికి చెందిన చాబోలు జాషువా అనే వ్యక్తి ఆయన కుమారులపై ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. తన పొలం బలవంతంగా రిజిష్టర్ చేయించుకొని ఇంట్లో నుంచి వెళ్లి పొమ్మంటున్నారని, అన్నం పెట్టకుండా మద్యం తాగివచ్చి బాధ పెడుతున్నారని.. మీరే న్యాయం చేయాలని ఎస్పీని ఆశ్రయించాడు. బేతంచెర్లకు చెందిన పాపసాని వెంకటలక్ష్మమ్మ అనే మహిళ తన కుమారుడు ఇంటిని వేరే వాళ్లకు విక్రయించాడని, జీవనానికి అందులో కొంత డబ్బులు ఇప్పించాలని ఎస్పీని వేడుకుంది. మరో ఘటనలో గుంతకల్లుకు చెందిన పి.రవీంద్ర అనే వ్యక్తి రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని తన వద్ద నుంచి రూ.4 లక్షలు తిరిగి ఇవ్వకుండా వేధిస్తున్నాడని కొలిమిగుండ్ల మండలం కల్వటాల గ్రామానికి చెందిన షేక్ గైబుషావలి ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. స్పందన కార్యక్రమంలో ఎస్పీతోపాటు స్పెషల్‌బ్రాంచ్ సీఐ రవీంద్ర, ఎస్సై హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


హర్షవర్ధన్


సుబ్బరాయుడు(ఫైల్)

కొలిమిగుండ్ల ఫిబ్రవరి 12: కొలిమిగుండ్ల - జమ్మలమడుగు క్రాసింగ్‌లో సోమవారం మధ్యాహ్నం రెండు మోటర్ సైకిళ్ళు ఎదుఎదురుగా ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మోటరు సైకిలిస్టులు మృతి చెందారు. కొలిమిగుండ్ల మండలం కల్వటాల గ్రామానికి చెందిన హర్షవర్ధన్ (25) మోటర్ సైకిల్‌పై కొలిమిగుండ్ల నుంచి పెట్రోలు పోయించుకోవడానికి వెళుతుండగా కొలిమిగుండ్లకు చెందిన కుమ్మరి సుబ్బరాయుడు మోటర్ సైకిల్ మీద వస్తూ పెట్రోల్ బంకు సమీపంలో వారి వాహనాలు ఢీకొన్నాయి. హర్షవర్ధన్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సుబ్బరాయుడు (45)ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. కొలిమిగుండ్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి: బుడ్డా



లింగాపురంలో విజయ్‌కుమార్‌ను పరామర్శిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 12: టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సూచించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విజయ్‌కుమార్‌ను సోమవారం లింగాపురం గ్రామంలో బుడ్డా పరామర్శించారు. అనంతరం గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతూ రెండు నెలల పాటు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ మేనిఫెస్టో గురించి, గతంలో టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. అలాగే వైసీపీ అరాచకాలను, అన్యాయాలను ప్రజలతో ఎండగట్టాలని, మళ్లీ చంద్రబాబునాయుడు సీఎం చేసుకోవాలన్న అవశ్యకతను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో షేక్ బాబు, హేమసుందర్‌రెడ్డి, బాషా, శీను పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'



నందికొట్కూరులో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

నందికొట్కూరు ఫిబ్రవరి 12: జగనాసుర పాలనపోయి రాష్ట్రాభివృద్ధి జరగాలంటే టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య అన్నారు. పట్టణంలోని 17వ వార్డులో సోమవారం 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మినీ మెనిఫెస్టో గురించి వివరించి కరపత్రాలను అందజేశారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జయసూర్య మాట్లాడుతూ చంద్రబాబు వస్తే అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి చేసే విధంగా సూపర్ సిక్స్ పథకాలను రూపొందించారన్నారు. మహా శక్తి పేరుతో 18 ఏళ్లు నిండిన మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500, తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15 వేలు, దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగాను, ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలకు టిక్కెట్టు లేని ప్రయాణం లాంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తామని తెలిపారు.యువగళం పేరుతో రాష్ట్రంలోని 20 లక్షల ఉద్యోగాలు, ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి, బీసీలకు రక్షణ చట్టం, ఇంటింటికి మంచినీటి కుళాయి కనెక్షన్, ఐదేళ్లల్లో పేదల ఆదాయం రెట్టింపు చేసేందుకు పూర్ టూ రిచ్ పేరుతో అన్ని వర్గాల ప్రజలను ఆర్థికం అభివృద్ధి చేస్తామన్నారు కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ భాస్కరరెడ్డి, నాయకులు షకీల్ అహ్మద్, మురళీధర్‌రెడ్డి, ముర్తుజావలి, బాబు, కళాకర్, నిమ్మకాయల రాజు, నిమ్మకాయల మోహన్, సత్తార్, పట్టణ మహిళా అధ్యక్షురాలు మినాక్షిదేవి, లక్ష్మి, రుబియా తదితరులు పాల్గొన్నారు.

'గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలి'



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకుడు రాజశేఖర్

ఆత్మకూరు, ఫిబ్రవరి 12: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసిస్తూ ఫిబ్రవరి 16వ తేదీన దేశవ్యాప్తంగా చేపట్టనున్న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం పిలుపునిచ్చారు. సోమవారం ఆత్మకూరు సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 2020-21 సంవత్సరానికి సంబంధించి ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరల చట్టాన్ని అమలులోకి తీసుకు రావడంతో పాటు కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. గ్రామీణ బంద్‌కు సంయుక్త కిసాన్ మోర్చా సంఘాల ఐక్య వేదిక, కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదికలు పిలుపునిచ్చినట్లు తెలిపారు.

కలుషిత నీటి సరఫరాపై అధికారుల ఆరా



ఇస్కాల గ్రామ శివారులో బోరును పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పాములపాడు, ఫిబ్రవరి 12: మండలంలోని ఇస్కాల గ్రామంలో పైపులైన్ల ద్వారా వీధి కొళాయిలకు కలుషిత నీరు సరఫరా అవుతుండటంతో ఎంపీడీవో సరస్వతి, ఈవోఆర్డీ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గ్రామాన్ని సోమవారం పరిశీలించారు. సోమవారం ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురితమైన కలుషిత నీరు సరఫరా, రోగాల బారిన గ్రామస్థులు అనే కథనానికి అధికారులు స్పందించారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకొంటున్నట్లు వారు తెలిపారు.

'పంట రుణాలు ఇవ్వాలి

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 12: భూయజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గ్రామ సభల ద్వారా కౌలు కార్డులను మంజూరు చేసి, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం షరతులు లేకుండా వడ్డీ లేని పంట రుణాలు మంజూరు చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన కౌలు రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం, పంటల బీమాను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే దేవాలయ భూములు సాగు చేస్తున్న వారందరికి సిసిఆర్ కార్డులు, పంట రుణాలు, ఈ క్రాపింగ్ చేయాలని, ఏసి కౌలు రైతులందరికి రైతు భరోసా ఇవ్వాలని, స్వామినాథన్ సిఫారసు ప్రకారం పంటలకు కేరళ తరహాలో మద్దతు ధరలు ప్రకటించి కౌలు రైతుల రుణాలు రద్దు చేసి, రుణ విముక్తి చేయాలని ప్రభుత్వం ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీలు సాగు చేసే కౌలు రైతులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ప్రజలు గెలిపించింది కబ్జా చేయడానికా?

● ఎమ్మెల్యే శిల్పా రవిపై టీడీపీ నాయకుల ధ్వజం



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 12: ప్రజలు గెలిపించింది మున్సిపల్ భూములు కబ్జా చేయడానికా? అని టీడీపీ నాయకులు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డిపై మండిపడ్డారు. నంద్యాలలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. టీడీపీ నంద్యాల ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్, రాష్ట్ర కార్యదర్శులు ఏవీఆర్ ప్రసాద్, తాతిరెడ్డి తులసిరెడ్డి, భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ నాయకులు పట్టణంలోని మున్సిపల్ స్థలాలను కబ్జా చేస్తున్న వైనంపై ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన కథనాన్ని చూపుతూ అధికార పార్టీ నాయకుల బాగోతంపై మండిపడ్డారు. నంద్యాలలోని ప్రభుత్వ ఆస్తులను, స్థలాలను ఎమ్మెల్యే అనుచరులు కబ్జా చేస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరలేపారని ఆయన ధ్వజమెత్తారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి ఇసుకాసురుడైతే నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి భూబకాసురుడుగా మారారని ఎద్దేవా చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పిలుపుమేరకు జిల్లాలో త్వరలోనే ఓటు ఫర్ సీబీఎన్ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. వైసీపీ పాలనలో యువతకు తీరని మోసం జరిగిందని, ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల, మెగా డీఎస్సీ, నిరుద్యోగ భృతి, ఉపాధి కల్పనలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ పాలనలో యువతకు చేసిన మేలును వారు గుర్తు చేశారు. ఈ ఎన్నికలకు నూతనంగా ఓటు హక్కును నమోదు చేసుకున్న యువతతోపాటు నిరుద్యోగులకు ఉజ్వల భవిష్యత్తును అందించే క్రమంలో ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర సంపదను వైసీపీ నాయకులు కొల్లగొడుతున్నారని విమర్శించారు. టీడీపీ హయాంలో నంద్యాలలోని మున్సిపల్ స్థలాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఆస్తులను కాపాడామని, అయితే ప్రస్తుతం శిల్పా పాలనలో ప్రభుత్వ ఆస్తులను కబ్జా చేస్తూ అనుచరులకు అప్పనంగా ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. మాజీ కౌన్సిలర్లు వాకా శివశంకర్‌యాదవ్, కృపాకర్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి'

నందికొట్కూరు, ఫిబ్రవరి 12: వైఎస్సార్ ఆసరా ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృష చేస్తోందని శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి, నందికొట్కూరు సమన్వయకర్త డా.సుధీర్ దారా అన్నారు. సోమవారం పట్టణంలోని చాముండి ఫంక్షన్ హాల్‌లో నందికొట్కూరు మండలంలోని 695 స్వయం సహాయ సంఘాల గ్రూపులకు రూ.5.15 కోట్ల చెక్కులను వారు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, జడ్పీటీసీ కరీమున్నీసా, తదితర నాయకులు పాల్గొన్నారు.

రేపు వసంత పంచమి

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 12: నంద్యాల సంజీవనగర్ కోదండ రామాలయంలో బుధవారం మాఘ శుద్ధ వసంత పంచమి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సరస్వతీదేవి అమ్మవారికి 108 కలశాలతో అష్టోత్తర శత క్షీరాభిషేకం, అష్ట గణపతి హోమం, సరస్వతీదేవి మూలమంత్ర హోమం, సాయంత్రం సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు భగవత్ సేవాసమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య తెలిపారు. 16న రథసప్తమి, 20న భీష్మ ఏకాదశి సందర్భంగా డాక్టర్ దివి హయగ్రీవాచార్యులతో సాయంత్రం సామూహిక విష్ణు సహస్ర నామ స్తోత్రం, ఉపన్యాసం ఉంటుందని కమిటీ సభ్యులు తెలపారు.

రేపటి నుంచి భాగవత ప్రవచనాలు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 12: నంద్యాల రమాసమేత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో 14, 15వ తేదీల్లో సాయంత్రం 7గంటలకు భాగవత మహాత్యం గురించి ప్రవచన కార్యక్రమం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీశైల దేవస్థానం వ్యాఖ్యాత డాక్టర్ దివి హయగ్రీవాచార్యులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం, ఫిబ్రవరి 12: శ్రీశైల దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం బాపట్లకు చెందిన గొల్లపూడి శ్రీనివాసరావు రూ.లక్ష విరాళాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి ఫణిధర్‌ప్రసాద్ అందజేశారు. భక్తుడికి దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

మహానంది: మహానంది క్షేత్రంలో భక్తుల కోసం దేవస్థానం అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి మహానంది గ్రామానికి చెందిన పిక్కిలి శంకర్ రూ.10,116 విరాళంగా అందచేసినట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రంగన్న తెలిపారు. సోమవారం ఆలయం ప్రాంగణంలోని విరాళాల కౌంటర్‌లో భక్తులు నగదును అందజేశారు. అధికారులు భక్తుడికి అన్నదానం బాండుతో పాటు స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

'ఈకేవైసీ తప్పనిసరి'

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 12: ప్రధాన మంత్రి కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి టి.మోహన్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీఎం కిసాన్ పథకం ద్వారా ఏడాదికి రూ.2 వేల చొప్పున మూడు సమాన వాయిదాల్లో రూ.6 వేలు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా అర్హులైన, భూమిని కలిగిన రైతులకు ఇప్పటి వరకు 15 వాయిదాల ప్రయోజనాన్ని భారత ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. 2023 డిసెంబరు- 2024 మార్చికి సంబంధించి 16వ విడత త్వరలో విడుదల అయ్యే అవకాశం ఉందన్నారు. రైతులకు ఈ-కేవైసీ చేయించేలా 21వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లాలోని అన్ని మండలాల వ్యవసాయాధికారులకు, ఆర్‌బీకేలలో పని చేస్తున్న వీఏఏలు, వీహెచ్ఏలు, వీఎస్ఏలు, ఎంపీఈవోలకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. పీఎం కిసాన్ పథకం ప్రయోజనాలను రైతులు కోల్పోకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ-కేవైసీ పూర్తి చేయని రైతులను గుర్తించడానికి ప్రత్యేక గ్రామ సభలను ఏర్పాటు చేయాలని భారత ప్రభుత్వం ఆదేశించిందని, అందుకు అనుగుణంగా అన్ని చర్యలు తీసుకోవాలని మోహన్‌రావు సూచించారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి: డీఎస్పీ

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 12: వచ్చే సార్వత్రిక ఎన్నికలను పోలీస్ సిబ్బంది నీతి, నిజాయతీ, నిస్వార్థంతో పకడ్బందీగా నిర్వహించాలని నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి సూచించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అండ్ ఎలక్షన్స్ ప్రాసెస్-2024 ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం నంద్యాల సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి రామకృష్ణ పీజీ కళాశాలలో కార్యక్రమం జరిగింది. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేందుకు పోలీసుల పాత్ర ఎంతో కీలకమని, ఆ దిశగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల సామగ్రి, మౌలిక సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, ఈవీఎం, వీవీప్యాట్‌లను జాగ్రత్తగా రవాణా చేయడం, భద్రపరచడం వంటి వాటిలో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. ఆయన ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

వైభవంగా రథోత్సవం



రథోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు

శ్రీశైలం, ఫిబ్రవరి 12: శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ, రథోత్సవాన్ని దేవస్థానం వైభవంగా నిర్వహించింది. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేసి, అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో పూజలు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి రథంపై ఆశీనులనుజేసి ప్రత్యేక పూజలు, మంగళహారతులు జరిపి ఆలయ ప్రాంగణంలో రథోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన నిత్యకళారాధన

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా సోమవారం వందన డ్యాన్స్ అకాడమి, తాడిపత్రి బృందంచే సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గణపతి స్తోత్రం, శివతాండవం, హరహరశంభో, శివోహం తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

పల్లకిలో మహానందీశ్వరుడి విహారం



మహానందీశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, ఫిబ్రవరి 12: మహానంది క్షేత్రంలో పరమశివునికి ప్రీతివంతమైన సోమవారం రాత్రి మహానందీశ్వరుడి పల్లకీ సేవను వేద పండితులు వైభవంగా నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలోని అలంకార మంటపంలో మహానందీశ్వర స్వామి, కామేశ్వరీదేవి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పూలతో అలంకరించిన పల్లకిపై అర్చకులు ఆశీనులు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల శివనామస్మరణ మధ్య పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. దేవస్థానం నిత్యాన్నదాన సత్రం కూరగాయల దాత లక్కబోయిన ప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

15న సీనియర్ ఖోఖో జట్ల ఎంపిక

ఆత్మకూరు, ఫిబ్రవరి 12: పగిద్యాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 15న ఖోఖో సీనియర్ జట్ల ఎంపిక చేయనున్నట్లు ఉమ్మడి కర్నూలు జిల్లా ఖోఖో అసోసియేషన్ చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి, కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు. సోమవారం ఆత్మకూరులో వారు మాట్లాడుతూ.. 56వ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలను పురస్కరించుకుని బాల బాలికల సీనియర్ జిల్లాస్థాయి జట్లను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 24,25,26 తేదిల్లో తూర్పు గోదావరి జిల్లాలోని సామర్లకోటలో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు హాజరవుతారని చెప్పారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులకు భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు.

పోస్టల్ పథకాలపై అవగాహన

మహానంది, ఫిబ్రవరి 12: మండలంలోని గోపవరం గ్రామంలో సోమవారం పోస్టల్‌శాఖ అందిస్తున్న వివిధ పథకాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్లలకు ఆకర్షణీయమైన పథకాన్ని పోస్టల్ శాఖ అమలు చేస్తోందని నంద్యాల సబ్ డివిజినల్ పోస్టల్ అధికారి పీకే సత్యనారాయణ రావు తెలిపారు. కార్యక్రమంలో గాజులపల్లి సబ్ పోస్టుమాస్టర్ రాజేశ్వరీ, ఏవో నరసింహ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి రూ.2 లక్షలు విరాళం



చెక్కును అందజేస్తున్న భక్తులు

పాణ్యం, ఫిబ్రవరి 12: మండలంలోని కొత్తూరు దేవస్థానం అభివృద్ధిలో భాగంగా మహాప్రాకార నిర్మాణానికి భక్తులు రూ.2 లక్షలు విరాళంగా అందజేసినట్లు ఆలయ ఈవో రామకృష్ణ తెలిపారు. నంద్యాల సాయిబాబా నగర్‌కు చెందిన సి.జమ్మన్న, రంగమ్మ వారి కుటుంబ సభ్యులు నిర్మాణ కాంట్రాక్టర్‌కు చెల్లించడానికి సోమవారం ఆలయ ఈవోకు చెక్కును అందజేశారు. గ్రామ పెద్దలు కృష్ణారెడ్డి, ఆలయసిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వేలం

పాణ్యం, ఫిబ్రవరి 12: మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ దుకాణాల వేలం పాటలు సోమవారం జరిగాయి. ఆలయ ఆలయ ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో, నంద్యాల దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్ పర్యవేక్షణలో వేలం పాటలు నిర్వహించారు. ఆలయ ఈ వేలాల్లో గాజుల అంగడికి వెంకటసుబ్బయ్య రూ.68 వేలకు దక్కించుకున్నారు. పూల అంగడిని బేతంచెర్లకు చెందిన సూర్యనారాయణ రూ.4.11 లక్షలకు దక్కించుకున్నారు. టెంకాయల వేలం పాటను అనువైన పాట లేక పోవడంతో తాత్కాలికంగా నిలిపివేశారు. ఆలయానికి 50 మీటర్ల దూరంలో అంగళ్లను ఏర్పాటు చేసుకోవాలని ఇందుకు విరుద్ధంగా నిర్వహించే పాటదారుల వేలాలు రద్దు చేసే అధికారం దేవదాయశాఖకు ఉంటుందని తెలిపారు. ఈ నిబంధనల మేరకే వేలాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ వేలాల కాలపరిమితి 2025 ఫిబ్రవరి 24వ తేదీవరకు వర్తిస్తుందని ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలం పాఠశాలకు అప్పగింత



కొట్టాల చెరువు గూడెంలో ఆక్రమణదారులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 12: ఆత్మకూరు మండలం కొట్టాల చెరువు గూడెంలో మండల పరిషత్ పాఠశాలకు అనుబంధంగా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన వసతి గృహం కోసం రెవెన్యూ అధికారులు సోమవారం సలాన్ని సేకరించారు. గతంలో ఈ పాఠశాలలో తక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్నప్పటికీ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు చొరవతో 120 కి పైగా గిరిజన విద్యార్థుల సంఖ్య పెరిగింది. దీంతో కేంద్ర ప్రభుత్వ సిఫారసులతో కొట్టాలచెరువు చెంచుగూడెంలో గిరిజన విద్యార్థుల సంక్షేమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇక్కడ వసతి గృహాన్ని మంజూరు చేసింది. ఇందుకు గాను 50 సెంట్ల స్థలం అవసరం కాగా తహసీల్దార్ కె.బాబు, డీటీ మనోహర్, సర్వే విభాగం డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణ ఇతర రెవెన్యూ సిబ్బంది కొట్టాల చెరువు గూడెం చేరుకుని సర్వే ద్వారా ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. కాగా కొంతమంది ఆ స్థలాన్ని ఆక్రమించడంతో వారికి హెచ్చరికలు జారి చేసి సోమవారం ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకుని గిరిజన వసతి గృహానికి ఆ స్థలాన్ని అప్పగించారు.

'వృత్తి విద్య కోర్సులు ఉపయోగకరం'



వెలుగోడులో సబ్ స్టేషన్ సందర్శించిన విద్యార్థులు

వెలుగోడు, ఫిబ్రవరి 12: విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులు ఎంతగానో ఉపయోగపడుతాయని చిన్న తనంలోనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణరావు అన్నారు. సోమవారం వెలుగోడు పట్టణంలో వృత్తి విద్య కోర్సులోని ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా స్థానిక విద్యుత్ ఉప కేంద్రాన్ని విద్యార్థులతో కలసి సందర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అప్రెంటిస్‌షిప్ సరికాదు'



మాట్లాడుతున్న లక్ష్మణ్ నాయక్

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 12: ఉపాధ్యాయ నియామకాల అనంతరం వారికి అప్రెంటిస్‌షిప్ విధానాన్ని పునరుద్ధరించే విధానం సరికాదని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ అన్నారు. సోమవారం నంద్యాలలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్రెంటిస్‌షిప్ విధానంతో ప్రైవేట్ ఉపాధ్యాయులు ఆర్థికంగా నష్టపోతున్నారని, గతంలో ఉద్యమాలు చేపట్టి ఆ విధానాన్ని రద్దు చేయిస్తే వైసీపీ ప్రభుత్వం మళ్లీ దాన్ని పునరుద్ధరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని ప్రధాన కూడలిలో భారతరాజ్యాంగ నిర్మాత డా.అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు భాస్కర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

'కార్మికులకు ద్రోహం చేసిన సీఎం జగన్'



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 12: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులను నమ్మించి మోసం చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికైనా కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకుంటే అందుకు మూల్యం చెల్లించుకోక తప్పదని ఏఐటీసీ పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు రంజిత్ విమర్శించారు. సోమవారం నల్ల బ్యాడ్జిలతో మున్సిపల్ కార్మికులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో వైసీపీ ప్రభుత్వం ప్రదర్శిస్తున్న అలసత్వ ధోరణిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కార్మికుల సంఘం కార్యదర్శి ప్రతాప్, సహాయ కార్యదర్శి శివరాముడు, ఉపాధ్యక్షుడు మస్తాన్, మహిళా నాయకురాలు మంగమ్మ, చిన్నమ్మ, జయమ్మ, లలితమ్మ పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు అవగాహన సదస్సు

గడివేముల, ఫిబ్రవరి 12: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం బీఎల్‌వోలకు ఎన్నికల ప్రక్రియపై డిప్యూటీ తహసీల్దార్ గురున్నాథం, ఎంపీడీవో శివరామిరెడ్డి అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను పకడ్బందిగా నిర్వహించాలని అన్నారు. మతి స్థిమితం లేనివారికి ఓటింగ్ హక్కును కల్పించరాదని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు, విద్యుత్ సౌకర్యం, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అనంతరం ఈవీఎంలపై అవగాహన కల్పించారు. సెక్టోరియల్ అధికారులు, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

కొత్తపల్లి ఎస్ఐగా హరిప్రసాద్



కొత్తపల్లి, ఫిబ్రవరి 12: కొత్తపల్లి మండలం పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా హరిప్రసాద్ సోమవారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. ఆయన నంద్యాల టూటౌన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీల్లో భాగంగా కొత్తపల్లికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన హుశేన్‌బాషా కడప ఏపీ ట్రాన్స్‌కోకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన హరిప్రసాద్ మాట్లాడుతూ శాంతిభద్రతలపై గట్టి నిఘా ఉంచుతామని ఎక్కడైనా గ్రామాల్లో నాటుసారా, అక్రమ మద్యం, పేకాట, గంజాయి తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డుకు మరమ్మతులు: డీఈ



శివపురం గూడెం-కొలనుభారతి రోడ్డును పరిశీలిస్తున్న డీఈ

కొత్తపల్లి, ఫిబ్రవరి 12: కొలనుభారతి పుణ్య క్షేత్రంలో బుధవారం జరిగే అమ్మవారి వసంత పంచమి వేడుకలకు వాహనాల ద్వారా హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రహదారి మరమ్మతులు చేపడుతున్నట్లు నందికొట్కూరు పంచాయతీరాజ్ డీఈ ధణిబాబు తెలిపారు. శివపురం గూడెం నుంచి కొలనుభారతి వరకు మట్టిరోడ్డుపై ఎక్కడెక్కడ గుంతలు ఉన్నాయనే వాటిపై సోమవారం సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శివపురం గూడెం నుంచి కొలనుభారతి వరకు రిజర్వు ఫారెస్టు ఉండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేవలం మట్టి రోడ్డుపై గుంతలు మాత్రమే పూడ్చివేసి వాటర్ క్యూరింగ్ చేస్తున్నట్లు చెప్పారు.

వేద పండితుడి శివైక్యం



జగన్నాథ శర్మ (ఫైల్)

శ్రీశైలం, ఫిబ్రవరి 12: శ్రీశైలం దేవస్థానంలోని అమ్మవారి ఆలయంలో వేద పండితుడిగా విధులు నిర్వహిస్తున్న జగన్నాథశర్మ శివైక్యం చెందారు. ఆదివారం రాత్రి చాతిలో నొప్పి రావడంతో దేవస్థానం వైద్యశాలకు తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం తరలిస్తుండగా మార్గమధ్యంలో శివైక్యం చెందారు. వేదపండితుడు జగన్నాథశర్మ మరణంతో దేవస్థానం సిబ్బంది దిగ్భ్రాంతి చెందారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ఉమా మహేశ్వర స్వామి పల్లకి సేవ



పల్లకి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

బనగానపల్లె, ఫిబ్రవరి 12: మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకి సేవ నిర్వహించారు. ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహే శ్వరరెడ్డితో పాటు భక్తులు, ఆలయ పూజారులు పల్లకిలో స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. పల్లకిసేవలో పాల్గొన్న భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఘనంగా ఆరో పీఠాధిపతి జయంతి

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 12: ఎగువ అహోబిలంలో 6 వ పీఠాధిపతి పరాంకుశ యతీంద్ర మహాదేశికన్‌కు జయంతి వేడుకలను సోమవారం వేపండితులు నవకలశ పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి, ఆయన కుమారుడు ఫణిక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అహోబిలేశుడికి పూజలు: ఆళ్లగడ్డ పట్టణంలోని ఎంపీడీవో, అగ్నిమాపక కేంద్రం, డీఎస్పీ కార్యాలయంలో పూజలందుకున్న అహోబిలేశుడి ఉత్సవ పల్లకి సోమవారం పి.చింతకుంట గ్రామానికి చేరుకుంది. గ్రామస్థులు ఉత్సవ పల్లకికి మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు.

చౌడేశ్వరీ మాతకు ప్రత్యేక పూజలు



కుంభాభిషేకం సందర్భంగా ప్రత్యేక పూజాల్లో పాల్గొన్న భక్తులు

బనగానపల్లె, ఫిబ్రవరి 12: మండలంలోని నందవరం చౌడేశ్వరీ మాత ఆలయంలో కుంబాభిషేకం సందర్భంగా సోమవారం మూడో రోజు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో రామానుజన్, వేద పండితుల సమక్షంలో భక్తులు యాగశాలను, అమ్మవారిని దర్శిం చుకున్నారు. ఆలయ గోపురాలకు ఏర్పాటు చేసే కలశాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం వేదపండితులు స్వస్తివాచనం, యాగశాలారాధనాలు, హోమాలు, చండీ యాగం, శ్రీచక్రార్చన, మహాలిం గార్చన, గోపురానికి జప పారాయణం నిర్వహించారు. సాయంత్రం స్వస్తివాచనం, రుద్రక్ర మార్చన, హోమ కార్యక్రమాలు, పుష్పాదివాసం, జపపారాయణం, పూర్ణాహుతి నిర్వహించారు.

వైభవంగా పవిత్రోత్సవం



కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

చాగలమర్రి, ఫిబ్రవరి 12: చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో మాఘమాసం సందర్భంగా సోమవారం వేద పండితుల ఆధ్వర్యంలో కళశ స్థాపన, పూర్ణాహుతి, పవిత్రోత్సవ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. వేద పండితుడు పెద్దశాస్త్రీ ఆధ్వర్యంలో గణపతి హోమం, రుద్రాభిషేకం, మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శివప్రసాదు, ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

స్వామి, అమ్మవార్లకు పూజలు

బేతంచెర్ల, ఫిబ్రవరి 12: మాఘమాసం పురస్కరించుకుని సోమవారం మండలంలోని ముచ్చట్ల మల్లికార్జున భ్రమరాంబదేవిలకు భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, కుంకుమార్చనలు జరిపారు.

గురప్ప స్వామికి..

రుద్రవరం, ఫిబ్రవరి 12: మండలంలోని బి.నాగిరెడ్డిపల్లె సమీపంలో కొలువుదీరిన గురప్పస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారికి నైవేద్యం సమర్పించారు.

యాగంటిలో 19న వేలం పాటలు

బనగానపల్లె, ఫిబ్రవరి 12: మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 19న వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తోటబుచ్చిరెడ్డిలు సోమవారం తెలిపారు. మరుగుదొడ్ల నిర్వహణ లైసెన్స్ కోసం హక్కు, కెమెరాలు, సెల్‌ఫోన్లు లగేజీ భద్రపరచుకోవడానికి ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని వారు కోరారు. ఆలయ నియమ నిబంధనల మేరకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల, ఫిబ్రవరి 12: బేతంచెర్ల పట్టణ శివారులోని కర్నూలు రహదారిలో వెలసిన షిరిడీ సాయిబాబా 16వ ఆలయ వార్షికోత్సవం అత్యంత వైభవంగా సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా ఆలయంలో ఉదయం 5 గంటలకు మందిర సంకీర్తన, 6 గంటలకు కాగడ హారతి, సుప్రభాతం అభిషేకం, మహా మంగళహారతి, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, రాత్రి పల్లకి సేవ నిర్వహించారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీరు ఆత్మహత్య

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 12: ఆళ్లగడ్డ మండలంలోని ఆల్ఫా ఇంజనీరింగు కళాశాల సమీపంలోని పొలాల్లో కోవెలకుంట్ల మండలం గుళ్లదుర్తి గ్రామానికి చెందిన నాగేశ్వరరెడ్డి కుమారుడు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సొరేశ్వరరెడ్డి(32) విష ద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం రాత్రి చెన్నై వెళ్లేందుకు మాయలూరులో సొరేశ్వరరెడ్డిని తండ్రి బస్సు ఎక్కించాడు. మృతుడు ఆళ్లగడ్డలో చెన్నైకి రిజర్వేషన్ చేసుకొని వెళ్తూ మార్గమధ్యలో ఆల్ఫా కాలేజీ వద్ద రాత్రి దిగి పొలాల్లో విషపు మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. తెల్లారి పొలాలకు వెళ్లే కూలీలు మృతుడిని చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడికి భార్య శ్రీలేఖ, ఏడాదిన్నర కుమారుడు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

'సూపర్‌సిక్స్'ను ఇంటింటికీ తెలియజేయండి

» టీడీపీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే బీసీ పిలుపు



మాట్లాడుతున్న బీసీ జనార్దన్‌రెడ్డి

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 12: బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కోవెలకుంట్ల పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం బూత్ ఇన్‌చార్జిలు, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జిలకు, టీడీపీ నాయకులతో బీసీ సమావేశమయ్యారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి తెలియజేయాలన్నారు. ముఖ్యంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ప్రతి సంవత్సరం మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ, ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20వేలు ఆర్థిక సాయం, తల్లికి వందనం పేరుతో చదువుకుంటున్న ప్రతి ఒక్కరికి రూ.ఏడాదికిరూ.15వేలు అందజేత, నిరుద్యోగులకు ప్రతి నెల రూ.3వేల నిరుద్యోగ భృతి, బీసీ రక్షణ చట్టం గురించి ప్రచారం చేయాలని బీసీ కోరారు. వైసీపీ ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతి, దౌర్జన్యాలు, అకృత్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమన్నారు. కేవలం గొప్పలు చెప్పుకోవడం తప్ప మరేమీ లేదని విమర్శించారు. సంక్షేమ పథకాల్లో కేవలం వైసీపీ వారికే ఇస్తూ తటస్థులకు నిబంధనల పేరిట సీఎం జగన్ మోసం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య పరచాలని కోవెలకుంట్ల టీడీపీ నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కోవెలకుంట్ల మండల అధ్యక్షుడు మద్దిలేటి, టీడీపీ నాయకులు డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, శేఖర్, మురళి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు చరమగీతం పాడాలి: మాజీ మంత్రి



గొడిగనూరులో అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

చాగలమర్రి, ఫిబ్రవరి 12: వైసీపీ కొనసాగిస్తున్న అరాచక పాలనకు ప్రజలే చరమగీతం పాడాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ పిలుపునిచ్చారు. మండలంలోని గొడిగనూరు గ్రామంలో సోమవారం వైసీపీ నుంచి 50 కుటుంబాలు అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరాయి. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆళ్లగడ్డలో అభివృద్ధి కుంటుపడిందని, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే ఐదేళ్ల కాలంలో నియోజకవర్గ సమస్యల గురించి అసెంబ్లీలో ఎప్పుడైనా మాట్లాడారా? అని ప్రశ్నించారు. వైసీపీ నాయకులు చేస్తున్న అరాచక పాలనతో విసిగిపోయిన ప్రజలు టీడీపీని గెలిపించుకునేందుకు స్వచ్ఛందంగా పార్టీలోకి వస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భూమా జగత్ విఖ్యాతరెడ్డి, భార్గవ్‌రామ్‌నాయుడు, మండల కన్వీనర్ నరసింహారెడ్డి, బీసీ సెల్ అధికార ప్రతినిధి సల్లా నాగరాజు, మాజీ సర్పంచ్ దేశంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఉసేన్‌రెడ్డి, రామ్మోహన్, కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరీఫ్, ముల్లా అబ్దుల్లా, అజీమ్, గఫార్, ప్రమోద్‌కుమార్, భూమా యూత్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం మాజీ సర్పంచ్ దేశంరెడ్డిని మాజీ మంత్రి అఖిలప్రియ పరామర్శించారు.

ఆళ్లగడ్డ: రాష్ట్రంలో వైసీపీ రాక్షసపాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలంతా సంసిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ మున్సిపల్ పరిధిలోని పడకండ్ల గ్రామంలో 30 కుటుంబాలు వైసీపీని వీడి సోమవారం అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరాయి. ఆమె మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే అక్రమాలు, అవినీతి అక్రమాలకు పాల్పడటంతో తనకు ఎక్కడ టికెట్ రాదోనని సీఎం జగన్ వద్ద టికెట్‌కోసం పడిగాపులు కాస్తున్నారన్నారు. కార్యక్రమంలో భూమా జగత్ విఖ్యాతరెడ్డి, మోహన్‌రెడ్డి, మనోహర్, రవి, జాఫర్‌రెడ్డి, నాగిరెడ్డిపల్లె శేఖరరెడ్డి, కృష్ణారెడ్డి ఉన్నారు.

అసమర్థ పాలనతోనే రాష్ట్రం అప్పుల పాలు

» టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి



టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను అందజేస్తున్న సుబ్బారెడ్డి

డోన్, ఫిబ్రవరి 12: వైసీపీ అసమర్థ పాలనతోనే రాష్ట్రం అప్పులపాలైందని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి విమర్శించారు. సోమవారం మండలంలోని గోసానిపల్లి, చింతలపేట గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో అరాచక పాలన సాగుతున్నదని అన్నారు. అధికార పార్టీ నేతలు భూదందాలకు, దోపిడీలకు పాల్పడుతున్నారని విమర్శించారు. అనంతరం ఆయన ఇంటింటా తిరిగి టీడీపీ మేనిఫెస్టో పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రజావైద్యశాల మల్లికార్జున, శ్రీనివాసులు యాదవ్, మధుసూదన్‌రెడ్డి, రామాంజినేయులు పాల్గొన్నారు.

నిందితుల అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

డోన్(రూరల్), ఫిబ్రవరి 12: డోన్ పట్టణం ప్రధాన రోడ్డు పక్కన నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి పేరుతో ఉన్న ఫ్లెక్సీలను చించేసిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం పట్టణ సర్కిల్ పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ డోన్ పట్టణానికి చెందిన నిందితులు విష్ణువర్ధన్ రెడ్డి, రవి కుమార్, పవన్ కుమార్, రంగస్వామి టీడీపీ ఫ్లెక్సీలను చించివేశారని విచారణలో తేలిందన్నారు. నిందితులను కొత్తబస్టాండు రోడ్డులో అరెస్టు చేసి డోన్ కోర్టులో హాజరు పరుస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్‌ఐ శరత్ కుమార్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'దివ్యాంగులకు ఉపాధి కల్పించాలి'



ర్యాలీ చేస్తున్న దివ్యాంగులు

రుద్రవరం, ఫిబ్రవరి 12: దివ్యాంగులకు ఉపాధి పని కల్పించాలని ఆదరణ సేవా సమితి వ్యవస్థాపకుడు రాష్ట్ర అధ్యక్షులు మరియదాస్ డిమాండ్ చేశారు. సోమవారం రుద్రవరంలో ర్యాలీ చేశారు. అనంతరం ఎండీవో రామచంద్రకు వినతిపత్రం అందించారు. దివ్యాంగులకు ఉపాధి పని కల్పించాలి, ఇళ్లు లేని వారిని గుర్తించి ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. సంక్షేమ పథకాలు ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని అన్నారు. 35 కేజీల అంత్యోదయ కార్డులు కూడా సామాజిక వికలాంగులకు కేటాయించాలన్నారు. పింఛను రూ.7వేలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎండీవో రామచంద్ర స్పందిస్తూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని తెలిపారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

బనగానపల్లె, ఫిబ్రవరి 12: బనగానపల్లె పట్టణంలోని వాసవి పాలిటెక్నిక్ విద్యార్థులు శిక్షణలో భాగంగా 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సోమవారం సందర్శించారు. విద్యార్థులకు ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణం, సబ్‌స్టేషన్ పనితీరును ఏఈఈ రఫీ విద్యార్థులకు వివరించారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ము న్ముందు మరిన్ని నిర్వహిస్తామని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సురేంద్ర, ఎలక్ట్రికల్ విభాగ అధిపతి నాగేంద్రలు తెలిపారు. అధ్యాపకులు దశరథ్‌రెడ్డి, అనూష, మధు అచారి పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవ రాయల విగ్రహ ఆవిష్కరణ

బనగానపల్లె, ఫిబ్రవరి 12: బనగానపల్లె పట్టణంలో సోమవారం బలిజ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆవిష్కరించారు. కాటసాని తిరుపాల్‌రెడ్డి, బలిజ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రామసుబ్బయ్య, నీలి శ్రీనివాసులు, కిశోర్‌కుమార్, రవి, రమేశ్, వెంకటేశ్వర్లు, మహేశ్, బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల తనిఖీ

చాగలమర్రి, ఫిబ్రవరి 12: మండలంలోని గొట్లూరు గ్రామంలోగల ప్రాథమిక పాఠశాలను ఎంఈవో అనూరాధ సోమవారం తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులు, వర్క్‌బుక్కులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తిరుమలదాసు, ఉపాధ్యాయులు ఉన్నారు.

'సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలి'

చాగలమర్రి, ఫిబ్రవరి 12: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనపై ఎలక్ట్రోరల్ అధికారులు దృష్టి సారించాలని తహసీల్దార్ రమణమ్మ సూచించారు. సోమవారం చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ విజయ్‌కుమార్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 12: కోవెలకుంట్ల పట్టణంలో వాసవి బొమ్మిడాల డీగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ హెచ్ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు డీఎం తిరుపతయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా రోడ్డు ప్రమాదాలు నివారణ చర్యలు అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో జి ఆదిలక్ష్మి, వి.నాగాంజలి, కె.షెహనాజ్‌లకు బహుమతులు అందజేశారు. అసిస్టెంట్ మేనేజర్ శేఖర్ అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలతో సమీక్ష

రుద్రవరం, ఫిబ్రవరి 12: రుద్రవరం తహసీల్దారు కార్యాలయంలో సోమవారం బీఎల్‌వోలతో తహసీల్దారు మురళీమోహన్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఫారం-6, 7,8లలో సరి చేయాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు. పూర్తి చేయడానికి 12వ తేదీ ఆఖరు అని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు రవీంద్ర ప్రసాద్, బీఎల్‌వోలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

బేతంచెర్ల, ఫిబ్రవరి 12: ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కర్నూలు ప్రధాన రహదారిలోని గోరుమానుకొండ తండా మెట్ట వద్ద సీఐ ప్రియతమ్ రెడ్డి, ఎస్‌ఐ శివశంకర్ నాయక్ ఆధ్వర్యంలో వాహనాలను సోమవారం తనిఖీ చేశారు. గోరుమానుకొండకు చెందిన చాకలి సాలన్న, ఓర్వకల్లు మండలం గుమితం తండాకు చెందిన సురేష్ నాయక్ ద్విచక్రవాహనంపై నాటుసారా తీసుకుని వస్తుండగా.. వారిని అదుపులోకి తీసుకుని 50 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐ శివశంకర్ నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాతబుగ్గలో ప్రతి సోమవారం అన్నదానం

డోన్(రూరల్), ఫిబ్రవరి 12: పట్టణ సమీపంలోని పాతబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమం ఉంటుందని ధర్మకర్త బైసాని రాజు తెలిపారు. సోమవారం రామలింగేశ్వరస్వామి ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రైతులను నట్టేట ముంచిన వైసీపీ ప్రభుత్వం



మాట్లాడుతున్న ఆలా మోహన్ రెడ్డి

డోన్(రూరల్), ఫిబ్రవరి 12: వర్షాభావ పరిస్థితులతో రైతులు తీవ్రంగా నష్టపోయినా రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని, రైతులను ఈ ప్రభుత్వం నట్టేట ముంచిందని డోన్ జనసేన నియో జకవర్గ నాయకుడు ఆలా మోహన్ రెడ్డి విమర్శించారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని జనసేన కార్యాలయంలో జనసైనికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో కేవలం ఆరు మండలాలను మాత్రమే కరువు మండలాలుగా గుర్తించారని అన్నారు. డోన్ నియోజకవర్గంలో ప్యాపిలి, డోన్ మండలాలను కరువు మండ లాలుగా గుర్తించకపోవడం దారుణమన్నారు. వర్షాభావ పరిస్థితులతో వేరుశనగ, ఆముదం, కంది పంటలు వేసిన రైతులు నష్టపోయారన్నారు. డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి, డోన్ మండలాలును కరువు మండలాలుగా గుర్తించి రైతులను ఆదుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు రాయల్ మల్లికార్జున, పరదేశీ మహేష్, గణేష్, జనార్దన్, వంశీ, ప్రవీణ్, పృథ్వి పాల్గొన్నారు.

అప్రెంటిస్ విధానం వద్దు

డోన్(రూరల్), ఫిబ్రవరి 12: డీఎస్సీ నోటిఫికేషన్‌లోకి అప్రెంటిస్ విధానం తీసుకురావడం సిగ్గు చేటని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి విమర్శించారు. సోమవారం రాత్రి పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో అప్రెంటిస్ విధాన అమలు జీవో ప్రతులను యూటీఎఫ్ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈసందర్భంగా వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ 20వేల ఉపాధ్యాయ పోస్టులు రాష్ట్రంలో ఖాళీగా ఉంటే.. కేవలం 6వేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను దగా చేయడమేనని అన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, యుటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సుబ్బరాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి ధార్మిక కార్యక్రమాలు

శిరివెళ్ల, ఫిబ్రవరి 12: మండలంలోని యర్రగుంట్ల ఎస్సీ కాలనీలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో మంగళవారం నుంచి ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకుడు మల్లు వెంకటరెడ్డి సోమవారం తెలిపారు. ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్‌జీ చేత శ్రీమద్రామాయణం, భగవద్గీతపై ధార్మిక ప్రవచనాలు, గోపూజ, కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హిందూ ధర్మ ఔన్నత్యాన్ని చాటి చెప్పేందుకు నిర్వహిస్తున్న ధార్మిక కార్యమాల్లో ప్రజలు విరివిగా పాల్గొనాలని ఆయన కోరారు. హిందూ గ్లోబల్ హెరిటేజ్ ధర్మ ప్రచారక్ నాగమల్లేశ్వరరెడ్డి, సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ మహేష్, అర్చకుడు నిరంజన్ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కల్గించొద్దు: సీఐ

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 12: కోవెలకుంట్ల పట్టణంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కల్గించొద్దని సీఐ జయచంద్ర అన్నారు. సోమవారం సర్కిల్ కార్యాలయం నుంచి ముదిగేడు చౌరస్తా- జమ్మలమడుగు టర్నింగ్ వరకు హోటళ్లు, కిరాణ దుకాణాలు, ప్రైవేటు వైద్యశాలలు, మెడికల్, పూల దుకాణాల వద్ద బైకులు పార్కింగ్ చేయవద్దని కోవెలకుంట్ల సీఐ జయచంద్ర, ఎస్‌ఐ వరప్రసాద్ ప్రజలకు అవగాహన కల్పించారు.

కబడ్డీ పోటీల విజేత ప్యాపిలి జట్టు

బేతంచెర్ల, ఫిబ్రవరి 12: మండలంలోని బుగ్గానిపల్లె తండా గ్రామంలో దేవరను పురస్కరించుకుని గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రథమ విజేతగా ప్యాపిలి కబడ్డీ జట్టు నిలిచింది. బుగ్గానిపల్లి తండాలో సేవాలాల్ మహారాజ్ మారెమ్మ దేవర సందర్భంగా ముగిసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో మొదటి బహుమతి రూ.12,116, ప్యాపిలి నిలవగా.. రెండో బహుమతి సాంబవరం జట్టు నిలిచి రూ.6,116, మూడో బహుమతిని బేతంచెర్ల రూ.3,116, నాలుగో బహుమతిని బుగ్గానిపల్లి జైశ్రీరామ్ జట్టు రూ.2,116 సాధించింది. విజేతలకు గ్రామ పెద్దలు బహుమతులు ప్రదానం చేశారు.

టీడీపీ నాయకుడి ఔదార్యం

సంజామల, ఫిబ్రవరి 12: టీడీపీ సంజామల మండల ఇన్‌చార్జి బత్తుల ప్రతాప్‌రెడ్డి సామాజిక సేవలో తన ఔదార్యం చాటుకుంటున్నారు. గిద్దలూరు గ్రామానికి చెందిన బత్తుల ప్రతాప్‌రెడ్డి ఈనెల 2న మృతి చెందిన తెలుగు పెద్దసంజీవరాయుడు దశదినకర్మలకు ఆయన కుమారుడు రామాంజనేయుడుకు దశ దిన కర్మల నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు.

భోజన పథకంలో అవినీతిని అరికట్టాలి

ప్యాపిలి, ఫిబ్రవరి 12: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో అక్రమాలను అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్య క్షుడు ప్రతాప్ అధికారులను డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఏఐఎస్ఎఫ్ విద్యార్థుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 12: కోవెలకుంట్లకు చెందిన టీచర్ నాగరాజు దంపతులు శ్రీశైల భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి దేవస్థానం అన్నదానానికి సోమవారం రూ.లక్ష విరాళం అందించారు. శ్రీశైలం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి శ్రీవిద్యకు అందజేశారు.

15లోపు పంట నమోదు చేసుకోవాలి'

రుద్రవరం, ఫిబ్రవరి 12: మండలంలో రబీ సీజన్‌లో పంట నమోదుకు ఈ నెల 15వ తేదీ ఆఖరు అని ఏవో శ్రీకృష్ణ సోమవారం అన్నారు. రైతులు సహకరించి పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. నిర్లక్ష్యం చేయవద్దని రైతులకు సూచించారు. ఈవో మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయినప్పుడు పంట నమోదు చేసుకున్న రైతులకే మాత్రమే పరిహారం వర్తిస్తుందని, లేకపోతే పరిహారం వర్తించదని తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

చాగలమర్రి, ఫిబ్రవరి 12: చాగలమర్రి మండలం ముత్యాలపాడు బస్టాండు సమీపంలో ఆంజనేయులు (41) అనే వ్యక్తి సోమవారం అనుమా నాస్పద స్థితిలో మృతి చెందారు. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన ఆంజనేయులుకు, చాగలమర్రికి చెందిన ఆదిలక్ష్మికి 2007 సంవత్సరంలో వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. వివాహం అనంతరం చాగలమర్రిలోనే నివాసం ఉంటూ ఆంజనేయులు హమాలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆంజనేయులుకు మద్యం తాగే అలవాటు ఉంది. గత రాత్రి ఇంటికి రాలేదు. ఉదయం ఇంటికి సమీపంలోని మిల్లులో చనిపోయి ఉన్నారు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కుటుం బీకులు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు నిర్ధారిం చారని చెప్పారు. ఆంజనేయులు తల్లి పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. ఆంజనేయులు శరీరంపై గాయాలు ఉండటంతో ఆయన తల్లి అనుమానాలు వ్యక్తం చేశారు. పోస్టుమార్టం అనంతరం పూర్తి వివరాలు తెలుస్తాయని ఎస్‌ఐ చెప్పారు.

నిందితులను అరెస్టు చేయాలి

సంజామల, ఫిబ్రవరి 12: నిందితులను అరెస్టు చేయాలని సంజామల పోలీసుస్టేషన్ ఎదుట ఎస్సీ కాలనీ వాసులు మహిళలతో కలిసి బైఠాయించారు. సోమవారం సంజామల గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన వలంటీరు శివకుమార్ శ్మశాన వాటికలో ఫొటోలు తీస్తుండగా, అదే కాలనీకి చెందిన జయరాముడు, లక్ష్మయ్య అనే వారు అతన్ని వెంబడించి దాడి చేయడంతోపాటు అడ్డుకున్న రామోజీ బుజ్జి మరికొందరిని కొడవలితో దాడి చేశారు. ఈ దాడిలో రామోజీ బుజ్జికి కుడికాలు తీవ్ర గాయమైంది. ఉదయం ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడంతో పోలీసు స్టేషన్ ఎదుట దళితులు బైఠాయించారు. ఈసందర్భంగా ఎస్సీ కాలనీవాసులు మాట్లాడుతూ గతంలో అదే పొలంలో శ్మశాన వాటికకు ఉపయోగించేవారమని అన్నారు. అప్పట్లో పంతాల రామసుబ్బయ్య అనే పెద్ద రైతు దళితుల శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించగా ప్రస్తుతం ఆ పొలం కొన్న జయరాముడు దళితుల శ్మశానంలో శవాలను పూడ్చేందుకు అడ్డుకుంటున్నాడని వారు వాపోయారు. కోవెలకుంట్ల సీఐ దేవేంద్ర, ఎస్‌ఐ రమేష్‌రెడ్డిలు వారిని శాంతింపజేసి నిందితులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రాత్రి 10గంటలకు దళితులు ఇళ్లకు తిరిగి వెళ్లారు.

ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

శిరివెళ్ల, ఫిబ్రవరి 12: కోటపాడు గ్రామంలో కొలువైన కేశవ స్వామి, వీరభద్ర స్వామి ఆలయాలకు వేరువేరుగా ధర్మకర్తల నియామకాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కోటపాడు గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి వేణునాథరెడ్డి సోమవారం తెలిపారు. ధర్మకర్తలుగా ఉండేందుకు అర్హత, ఆసక్తి కలిగిన వ్యక్తులు పూర్తిచేసిన దరఖాస్తులను నంద్యాల పరిధిలోని రైతునగరంలో ఉన్న దేవదాయశాఖ జిల్లా కార్యాలయంలో ఈ నెల 21వ తేదీలోగా అందజేయాలని తెలిపారు. వివరాల కోసం 8333811586, 9491633491 నెంబర్లను సంప్రదించాలని ఈవో సూచించారు.

'శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు'

చాగలమర్రి, ఫిబ్రవరి 12: సార్వత్రిక ఎన్నికల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే పోలీసు చర్యలు తప్పవని ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతనాయక్ హెచ్చరించారు. సోమవారం రాత్రి మండలంలోని గొడిగనూరు గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయా పార్టీ నాయకులతో, ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గొడవలు సృష్టించకుండా శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలని, ఏవైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమణయ్య, పోలీసులు ఉన్నారు.

అధిక లోడుతో వెళ్లే వాహనాలకు జరిమానా

బేతంచెర్ల, ఫిబ్రవరి 12: పట్టణంలో డోన్ ఎంవీఐ క్రాంతి కుమార్ సోమవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా రోడ్ ట్యాక్స్, ఫిట్‌నెస్, పర్మిట్లు, డ్రైవింగ్ లైసెన్సు లేని 6 వాహనాలకు జరిమానా విధించారు. అధిక లోడుతో వెళ్తున్న ఇసుక లారీ రూ.46,400 జరిమానా, మద్యం సేవించి తమిళనాడుకు చెందిన సిమెంటు బల్గర్ వాహనాన్ని నడుపుతున్న డ్రైవర్‌పై కేసు నమోదు చేసి వాహనాలను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు ఆయన తెలిపారు. మొత్తం 8 వాహనాలకు రూ.96,740లు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

'తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి'

రుద్రవరం, ఫిబ్రవరి 12: మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రామచంద్ర సూచించారు. వేసవి సమీపించడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్నారు. తాగునీటి ఎద్దడి నివారణలో నిర్లక్ష్యం వద్దని సూచించారు.